RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 446 | 11 మంగళవారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--







# పన్నుల బిల్లుకు పార్లమెంట్ ఆమోదం..

## యూపీఐ ఛార్జీలపై నిర్మలా సీతారామన్ కీలక ప్రకటన



యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారులకు ఎటువంటి ఛార్జీలు లేదా పన్నులు విధించే ఉద్దేశం లేదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంటులో స్పష్టం చేశారు. పన్నుల, ఇతర చట్టాల (సవరణ) బిల్లు 2026కు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సందర్భంగా ఆమె ఈ కీలక ప్రకటన చేశారు.గత వారం లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లును, సోమవారం రాజ్యసభ సైతం మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 10ఏకు చేసిన సవరణ కేవలం వెసులుబాటు కల్పించే నిబంధన మాత్రమేనని వివరించారు. ఈ సవరణ ద్వారా యూపీఐ వినియోగదారులపై ఎటువంటి లావాదేవీ ఛార్జీలు లేదా పన్నులు విధించడం లేదని ఆమె సభకు విస్పష్టంగా తెలిపారు.

మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధింపుపై వెలువడుతున్న ఊహాగానాలపై కూడా ఆమె స్పష్టతనిచ్చారు. పార్లమెంట్ ఆమోదం అనంతరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) స్టీరింగ్ కమిటీ దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని, ప్రస్తుతం ఎటువంటి ఎండీఆర్ ఫ్రేమ్‌వర్క్‌ను ఖరారు చేయలేదని వెల్లడించారు. భవిష్యత్తులో ఒకవేళ ఎండీఆర్‌ను ప్రవేశపెట్టినా, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన అధిక విలువ గల వ్యాపార లావాదేవీలకు మాత్రమే వర్తిస్తుందని ఆర్థిక శాఖ గతంలోనే స్పష్టం చేసింది. పాలు, కూరగాయలు, కిరాణా వంటి 90 శాతానికి పైగా రోజువారీ కొనుగోళ్లు వ్యాపారులకు కూడా ఉచితంగానే అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. 2016లో ప్రారంభమైన యూపీఐ, 2020 జనవరి నుంచి ఉచిత సేవలను అందిస్తూ ప్రపంచంలోనే అతిపెద్ద రియల్-టైమ్ చెల్లింపు వ్యవస్థగా అవతరించింది.

## నేను డీసీఎంపై నుంచి కిందపడకుండా కాపాడింది పెద్ది సుదర్శన్ రెడ్డి..

### - హరీశ్ రావు భావోద్వేగం



నల్లబెల్లిలో దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి సంతాప సభలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పాల్గొని నివాళులు అర్పించారు. సంతాప సభలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డితో తనకున్న జ్ఞాపకాలు గుర్తు చేసుకొని కన్నీళ్లు పెట్టుకున్నారు. మొన్న పెద్ది సుదర్శన్ రెడ్డి ఆస్పత్రిలో పడితే నేను, కేటీఆర్ ఆగమేఘాల మీద పరుగెత్తుకుంటూ వచ్చాం. వచ్చే సరికి ఆస్పత్రి చూస్తే నాకొక పాత జ్ఞాపకం గుర్తొచ్చింది. ఒక ఉద్యమకారుడు తెలంగాణలో ఆత్మహత్య చేసుకుంటే డీసీఎంపై ఆ అమరుడి అంతిమయాత్ర జరుగుతుంది. ఆ అంతిమ యాత్ర జరుగుతుంటే వరంగల్‌లోని అమరవీరులస్థూపం వద్ద పోలీసులకు, మనకు మధ్య బాగా ఘర్షణ అయింది. ఆ ఘర్షణలో నేను డీసీఎంపై నుంచి కిందపడ్డానన్నారు.డీసీఎంపై నుంచి కిందపడ్డప్పుడు నన్ను పట్టుకున్నది పెద్ది సుదర్శన్ రెడ్డి. నేను భూమి మీద పడాలి. కానీ నేను ఆయన చేతుల పడి కిందపడ్డా ఆరోజు. వెంటనే సుదర్శన్ రెడ్డి నన్ను ఆస్పత్రికి తీసుకెళ్లిండు. ఆ రోజు ఏ ఆస్పత్రికైతే సుదర్శన్ రెడ్డి నన్ను తీసుకపోయిండో.. పాపం ఆ ఆస్పత్రిలో సుదర్శన్‌రెడ్డిని చివరి చూపు కూడా చూస్తానని కలలు కూడా కనలేదు. అప్పుడు నాకు దెబ్బతాకితే ఆగమేఘాల మీద సుదర్శన్ రెడ్డి నన్ను ఆ ఆస్పత్రికి తీసుకపోయిండు. పాపం సుదర్శన్ రెడ్డి చివరి దశలో ఆ ఆస్పత్రిలో ఉన్నడని కన్నీంటి పర్యంతమయ్యారు.

## శ్రీవారి సేవకు రూ.15 లక్షల ట్రక్.. టీటీడీకి వాహన విరాళం



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)కు సోమవారం ఓ భారీ విరాళం అందింది. తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర మోటార్స్ సంస్థ, టీటీడీ రవాణా అవసరాల నిమిత్తం తమవంతు సహాయంగా ఓ నూతన ట్రక్కును విరాళంగా అందించింది. సుమారు రూ.15.24 లక్షల విలువైన ఈ ఎస్.ఎం.ఎల్. మహీంద్రా ట్రక్కును సంస్థ మేనేజింగ్ పార్టనర్ లోకనాథ రెడ్డి అందజేశారు.సోమవారం ఉదయం శ్రీవారి ఆలయం ముందు దాత లోకనాథ రెడ్డి కుటుంబ సమేతంగా వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, వాహనానికి సంబంధించిన తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథంకు భక్తిశ్రద్ధలతో అందజేశారు. శ్రీవారి సేవలకు భక్తులు నగదు, బంగారం వంటి కానుకలతో పాటు, ఇలా వాహనాలను కూడా విరాళంగా అందిస్తుండటం తెలిసిందే. ఈ ట్రక్కును టీటీడీ తన రవాణా అవసరాల కోసం వినియోగించనుంది.

తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మరోవైపు, తిరుమల కొండపై భక్తుల రద్దీ అధికంగా కొనసాగుతోంది. నిన్న ఆగస్టు 9న ఒక్కరోజే 87,179 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ.4.59 కోట్లుగా నమోదైంది. అదేవిధంగా, 34,256 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.భక్తుల రద్దీ కారణంగా సర్వదర్శనం టోకెన్లు లేని వారికి శ్రీవారి దర్శనానికి సుమారు 20 నుంచి 24 గంటల సమయం పడుతోందని అధికారులు తెలిపారు. క్యూలైన్లు వైకుంఠం కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, శిలాతోరణం వరకు బయటకు విస్తరించాయి. టీటీడీ అన్నప్రసాద విభాగం ద్వారా 3.11 లక్షల మందికి, అశ్విని ఆసుపత్రిలో 3,538 మందికి సేవలు అందించినట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు.

## దైవ నామాలను అపహాస్యం చేయొద్దు

### : పవన్ కల్యాణ్



దైవ నామాలను, భక్తి గీతాలను రాజకీయ ప్రయోజనాల కోసం పేరడీలుగా మార్చి అపహాస్యం చేయడాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తీవ్రంగా ఖండించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి పవిత్ర నామాలను కించపరచడం దారుణమని ఆయన పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.నెల్లూరు నగరంలో చోటుచేసుకున్న ఓ ఘటనను ఆయన ప్రస్తావించారు. కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేని ఓ రాజకీయ పార్టీ, తమ కార్యక్రమాల్లో పవిత్రమైన గోవింద నామాలను పేరడీగా వాడుకోవడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచిందని అన్నారు. ఆ కార్యక్రమంలో పాల్గొన్న వారి తీరు ధార్మిక విశ్వాసాలకు విఘాతం కలిగించేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం అపహాస్యం చేయడమే కాదని, మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టే కుట్రపూరిత ఆలోచన అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ శ్రేణులకు పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ధార్మిక విశ్వాసాలతో ముడిపడిన అంశాలను చులకన చేసే ఇలాంటి చర్యలను సహించకూడదని స్పష్టం చేశారు.రాజకీయాలతో సంబంధం లేకుండా ఎవరూ కూడా దైవ నామాలు, మంత్రాలు, స్తోత్రాలను అపహాస్యం చేసేందుకు వినియోగించవద్దని ఆయన హితవు పలికారు. భక్తికి సంబంధించిన పవిత్రమైన విషయాలను గౌరవించడం అందరి బాధ్యత అని ఆయన సూచించారు. ఈ మేరకు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.

### విద్యార్థులకు అమిత్ షా సమాధానం

## చెప్పి తీరాల్సిందే

### : రాహుల్ గాంధీ



పార్లమెంటు కు విద్యార్థులు ర్యాలీ నిర్వహించిన సందర్భంగా పోలీసులు బలప్రయోగానికి దిగడంపై కాంగ్రెస్ ఎంపీ) రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. ఈ ఉదంతంలో పాలకులు అయితే దోషులైనా లేదంటే అసమర్థులైనా అయ్యుండాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. పెల్లెట్ గన్నులు, ముళ్లు ఉన్న బ్యాటన్స్, టియర్ గ్యాస్ తో విద్యార్థులపై దాడులు జరిగాయని అన్నారు.శాంతియుతంగా ప్రశ్నలు అడిగిన వారిపై దాడులు జరిగాయని, యువతులను కూడా పోలీసులు కొట్టారని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. పలువురికి ఎముకలు విరిగాయన్నారు. ప్రశ్నలు అడిగిన వారితో మోదీ ప్రభుత్వం అనాగరికంగా వ్యవహరించిందని విమర్శించారు. పార్లమెంటు సమావేశాలు 20 రోజులుగా జరుగుతున్నా హోం మంత్రి సభకు రాలేదని ఆక్షేపించారు. విద్యార్థులపై బలప్రయోగంపై చర్చించేందుకు ప్రతిపక్షం ప్రవేశపెట్టిన ప్రతి తీర్మానం తిరస్కరణకు గురైందని చెప్పారు.ఈ మౌనం నిర్లక్ష్యమో మరొకటో కాదని, అక్కడ విద్యార్థులపై జరిగిన హింసకు ఆమోదమని రాహుల్‌గాంధీ అన్నారు. వాళ్లు దోషులైనా అయ్యుండాలి లేదా అసమర్థులైనా అయ్యుండాలని ఎద్దేవా చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ ఉదంతంపై దర్యాప్తు జరగాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. అప్పటి వరకు తమ పోరాటం ఆగదని ఎక్స్ వేదికగా రాహుల్ గాంధీ స్పష్టంచేశారు.

## ప్రజల గుండెల్లో నిలిచిన నాయకుడు

### : పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభలో కేటీఆర్



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం నిర్వహించిన సంస్మరణ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సంపేటలో నిర్మించనున్న మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెట్టనున్నట్లు కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని అగ్రభాగాన నిలిచి నడిపించిన గొప్ప నాయకుడు పెద్ది అని ఆయన కొనియాడారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, “ఎంతకాలం జీవించామన్నది ముఖ్యం కాదు, ఎలా జీవించామన్నదే ప్రధానం. పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక్క పర్యాయం ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసేలా పనిచేశారు“ అని వ్యాఖ్యానించారు. ఆయన అంత్యక్రియలకు పోటెత్తిన అశేష జనవాహిని, ప్రజల్లో ఆయనకు ఉన్న గౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. సుదర్శన్ రెడ్డి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు.పార్టీ ఆవిర్భావం నుంచి కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సుదర్శన్ రెడ్డి, జులై 31న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన గతంలో జడ్పీటీసీ సభ్యుడిగా, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా సేవలందించడంతో పాటు, 2018-2023 మధ్య కాలంలో నర్సంపేట ఎమ్మెల్యేగా బాధ్యతలు నిర్వహించారు.కాగా, నిన్న ఆదివారం నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్రమంలో పార్టీ తరఫున ప్రకటించిన రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఇందులో సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల పేరున ఒక్కొక్కరికి కోటి రూపాయల చొప్పున, ఆయన తల్లి సంక్షేమం కోసం రూ. 25 లక్షలను కేటాయించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# ఫోర్‌లైన్ పనులకు కదలిక తేవాలి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 10:-
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం:
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఖానాపూర్ గేట్ నుంచి గురునానక్ కాలేజీ మీదుగా మాల్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని మల్రెడ్డి నిరంజన్‌రెడ్డి కోరారు. నాగార్జునసాగర్‌లో నిర్వహిస్తున్న వరుణయాగానికి వెళ్తున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఇబ్రహీంపట్నం చౌరస్తాలో ఆయన ఘన స్వాగతం పలికారు.
ఈ సందర్భంగా మంత్రిని కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఖానాపూర్ గేట్ నుంచి మాల్ వరకు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో కూడిన ఫోర్‌లైన్ రహదారి నిర్మాణం పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరం కావడంతో పాటు ప్రమాదాల సంఖ్య తగ్గే అవకాశం ఉందని తెలిపారు. ఈ మార్గంలో ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రైతులు, కార్మికులు ప్రయాణిస్తున్నారని, ట్రాఫిక్ ఒత్తిడి నిరంతరం పెరుగుతోందని వివరించారు. ఇటీవల తక్కెళ్లపల్లి వార్డు సభ్యుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటనను ప్రస్తావిస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, రహదారి పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని కోరారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కె.పి.వి. రాజు కూడా రహదారి అభివృద్ధి అవసరాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
అలాగే మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వంట సిబ్బందికి గ్యాస్ సిలిండర్లు అందించాలని కోరగా, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి అవసరమైన చర్యలు



తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గ రోడ్ల అభివృద్ధికి హెచ్‌ఏఎం పథకం కింద నిధులు కేటాయించినందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మల్రెడ్డి నిరంజన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా స్ఫూర్తితో ఇబ్రహీంపట్నంలో 'జైల్ భరో'

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 10:-
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం:
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మిక, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఇబ్రహీంపట్నంలో సోమవారం 'జైల్ భరో' కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు. కార్మికుల హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పని దినాన్ని కొనసాగించడంతో పాటు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనాన్ని నెలకు రూ.26 వేలుగా నిర్ణయించాలని, ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు రూ.800 కూలి చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపట్టాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఇబ్రహీంపట్నంలో రాస్తారోకో నిర్వహించగా, పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. ఈ సందర్భంగా నిరసనలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జై రుద్రకుమార్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రామచందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్, కేవీపీఎస్ జిల్లా




అధ్యక్షుడు బి. సామెల్, సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కన్వీనర్ చింతపట్ల ఎల్లేష్, బుగ్గ రాములు, జంగయ్య, ముసలయ్యతో పాటు పలువురు కార్మిక సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

# ధరలు పెరుగుతున్నట్లు కార్మికుల వేతనాలు పెంచండి.

మంచిర్యాల, ఆగస్టు 10 మంచిర్యాల
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తూ, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తున్న బీజేపీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈరోజు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓవర్ బ్రిడ్జి సమీపంలో కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మేకల దాసు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, దుంపల రంజిత్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి, లాల్ కుమార్ ఎఐకెయంయస్ రాష్ట్ర కార్యదర్శి, టి శ్రీనివాస్ ఐ ఎఫ్ టి యూ జిల్లా అధ్యక్షులు, మాట్లాడుతూ ధరలు పెరుగుతున్నట్లు కార్మికుల వేతనాలు పెంచండి అని డిమాండ్ చేశారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఏకమై పోరాడిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు ప్రయత్నిస్తోందని వారు విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందించడం దుర్మార్గమన్నారు. అదేవిధంగా రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెట్, రుణ విముక్తి వంటి సమస్యలను పరిష్కరించకుండా కేంద్ర





ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రజా ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం, ధరలు పెంచడం వంటి చర్యలతో సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆరోపించారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, పాత 44 కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలని, రైతులకు గిట్టుబాటు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని వారు డిమాండ్ చేశారు. దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులు, దేశానికి అన్నం పెడుతున్న రైతులు, కష్టజీవి ప్రజల ప్రయోజనాలను పక్కన పెట్టి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న పాలకుల విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్లను కాపాడే విధానాలు క్విట్ ఇండియా ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు క్విట్ ఇండియా అంటూ కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మేకల దాసు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి
ఎండీ అక్బర్ అలీ, జిల్లా అధ్యక్షులు, ఖలీందర్ అలీ ఖాన్, జిల్లా గౌరవ అధ్యక్షులు, మిట్టపల్లి పౌలు, బోయపోతుల కొమురయ్య, మండల శ్రీనివాస్, రామన్న, దేవి పోచన్న. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, గోమాస ప్రకాష్ జిల్లా ఉపాధ్యక్షులు పద్మావతి రఫియా, శ్రీనివాస్ సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు, పైరాల రాములు రజక సంఘం జిల్లా కార్యదర్శి, రైస్ మిల్ హమలి యూనియన్ ప్రెసిడెంట్ సురేందర్, రమేష్, AIKMS రాష్ట్ర సహాయ కార్యదర్శి. ఒా. ఏలాల్ కుమార్, IFTU జిల్లా అధ్యక్షులు. శ్రీనివాస్, IFTU జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ. బ్రహ్మానందం, AIKMS జిల్లా ఉపాధ్యక్షులు దొండ ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, AIKKS రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగర్ల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ కుటుంబానికి బీజేపీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకన్న చేయూత

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
కూనూరు: జఫర్‌గఢ్ మండలం కూనూరు గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు సకినాల నాగరాజు, సకినాల రాజు తల్లి సకినాల ఎల్లమ్మ మృతి చెందడంతో వారి కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, బీజేపీ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) పరామర్శించారు.
ఈ సందర్భంగా కుటుంబానికి ఆర్థిక సహాయంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన వెంకన్న, కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.



ఈ కార్యక్రమంలో బీజేపీ జనగాం జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు ఇల్లందుల సారయ్య, బూత్ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు, బెల్లి పెద్దన్న, సకినాల కొమురెల్లి, తీగారపు బుచ్చయ్య, సీనియర్ నాయకులు ఎల్లా



చారి, ముచ్చ యాదవ రెడ్డి, బీజేపీ యువ నాయకులు వేముల రాకేష్, వేముల నాగరాజు, కొండవీణ సందీప్, వల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నవరస నాట్యంలో సాయి ఉన్నతి మెరుపులు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 10:-
హైదరాబాద్: బీరంగూడ: నృత్యరంగంలో తన ప్రతిభను చాటుకుంటూ బీరంగూడకు చెందిన 7వ తరగతి విద్యార్థిని ఎం. సాయి ఉన్నతి ప్రత్యేక గుర్తింపు సాధించారు. శ్రీరంగంలోని కట్టళగియా సింగపెరుమాళ్ ఆలయంలో ఆగస్టు 9న నిర్వహించిన 'నవరస నాట్య2026' కార్యక్రమంలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపుతో ప్రపంచ రికార్డు ప్రయత్నంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సాయి ఉన్నతి తన నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఏక నృత్యంతో పాటు బృంద నృత్య ప్రదర్శనల్లోనూ సాయి ఉన్నతి పాల్గొని తన నాట్య నైపుణ్యాన్ని ప్రదర్శించారు. నృత్యంలోని హావభావాలు, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుని ప్రశంసలు అందుకున్నారు. చిన్న వయసులోనే ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనడం ఆమె కళా ప్రతిభకు నిదర్శనమని పలువురు అభినందించారు. ప్రపంచ రికార్డు ప్రయత్నంలో భాగస్వామ్యం కావడం ద్వారా సాయి ఉన్నతి తనకు మాత్రమే కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులకు గర్వకారణంగా నిలిచారు. ఆమె భవిష్యత్తులో నృత్యరంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పలువురు ఆకాంక్షించారు. సాయి ఉన్నతి ప్రతిభను గుర్తించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

## ఉద్యమ స్ఫూర్తి పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళి ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్



హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
తెలంగాణ ఉద్యమ నాయకులు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి పట్ల తెలంగాణ ఉద్యమకారుల ఫోరంచిట్యాల మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం చిట్యాల మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చిట్యాల మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమానికి పెద్ది సుదర్శన్ రెడ్డి ఒక దిక్సూచిగా నిలిచారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని పల్లెపల్లెకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరిచడంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, ఉద్యమకారులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ తెలంగాణ ఉద్యమకారుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని జన్నె యుగేందర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి సేవలను తెలంగాణ సమాజం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల గౌరవ అధ్యక్షులు సాద మల్లయ్య, ప్రధాన కార్యదర్శి కన్నబోయిన అశోక్, జిల్లా నాయకులు కాత్రేవుల కుమార్, కోశాధికారి కంచర్ల కుమారస్వామి, ఉపాధ్యక్షులు సంగ రాజేందర్, కార్యదర్శి దొడ్డె శంకర్, వేముల శ్రీనివాస్, ముఖ్య సలహాదారులు పిట్టల రాజమౌళి, పెండ్లి యాదిరెడ్డి, గొర్రె సతీష్, గోల్కొండ చక్రపాణి, బోగం నర్సయ్య, కార్యవర్గ సభ్యులు గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్ పర్లపల్లి రాములు, ఉద్యమకారులు, తెలంగాణ అభిమానులు తదితరులు పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# ఎమ్మెల్యేకు ఆహ్వానం

## - హోటల్ ప్రారంభోత్సవానికి హాజరు కావాలని కోరిన గాలిస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు



గీసుగొండ, ఆగస్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
గాలిస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన హోటల్ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని కోరుతూ పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని సొసైటీ ప్రతినిధులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమ వివరాలను ఎమ్మెల్యేకు తెలియజేసి, కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ, సర్పంచ్ గాలి యాకయ్య, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూల రమేష్, వార్డు సభ్యుడు కొంగర సారిబాబు, సర్వేయర్ గాలి సదానందం, గాలిస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గాలి మధు, గాలి శ్రవణ్, గాలి పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులకు స్వాగతం పలికిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



హనుమకొండ జిల్లాలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను ఎల్కతుర్తి మండల కేంద్రంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
11 మంగళవారం ఆగస్టు 2026

# కార్యకర్త కుటుంబానికి అండగా బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ వెంకన్న

### గబ్బెట సుధాకర్ కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేత



హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
స్టేషన్ ఘనపూర్ జఫర్‌గడ్ మండలం సాగరం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త గబ్బెట విద్యాసాగర్ తండ్రి గబ్బెట సుధాకర్ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జీ పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) సాగరం గ్రామానికి వెళ్లి సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. కుటుంబానికి అండగా నిలుస్తూ ఆర్థిక సహాయంలో భాగంగా 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కష్టకాలంలో పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వెంకన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జనగామ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య, బూత్ అధ్యక్షులు గబ్బెట వెంకటయ్య, సీనియర్ నాయకులు మచ్చ బాబు, మచ్చ యాదయ్య, బాశుపాక మల్లేశం, కూనూరు గ్రామ బూత్ అధ్యక్షులు సకినాల కొమురెల్లి, బెల్లి పెద్దన్న, తీగారపు బుచ్చయ్య, ముచ్చ యాదవ రెడ్డి, కోమళ్ల గ్రామ బూత్ అధ్యక్షులు వల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి పాలనకు వ్యతిరేకంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ లో సిపిఐ ప్రజా పోరుయాత్ర ప్రారంభం



హైదరాబాద్ ఎస్టేట్ 10ఆగష్టు
5 వ రోజు ప్రజా పోరుయాత్రను మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణం లోని బిజోన్ సెంటర్లో జేండా ఊపి ప్రారంభించినరు సిపిఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఇప్పకాయల లింగయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటమే కమ్యూనిస్టుల ధ్యేయం అని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టిందని, బిజెపి పాలనకు వ్యతిరేకంగా సిపిఐ పోరుయాత్ర చేపట్టిందని దేశంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిని క్రమబద్ధంగా దెబ్బతీసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసిందని, సాధారణ పౌరులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని అన్నారు. ప్రజల సంక్షేమాన్ని విస్మరించిన మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు వంతపాడుతూ దేశ సంపదను వారికి దోచి పెడుతున్నదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసి ఉద్యోగులను రోడ్డు పైకి నెట్టిందని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేసిందని చెప్పారు. చివరకు పోటీ పరీక్షల పేపర్ లను లీక్ చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడిందని, పరీక్షా పేపర్ ల లీకేజీ పై డిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయక తప్పలేదని అన్నారు. సామాన్య ప్రజలపై ధరల భారాలు మోపిందని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని అన్నారు. రైతాంగాన్ని పూర్తిగా విస్మరించారని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వడంలో విఫలమయ్యారని, రైతు సంక్షేమాన్ని దెబ్బతీశారని అన్నారు. మోదీ పాలనలో పెరుగుతున్న నియంతృత్వ ధోరణులలో భాగంగా రాజకీయ వ్యతిరేకులను అణచివేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం, ప్రజాస్వామ్య వ్యవస్థలను క్రమంగా నిర్వీర్యం చేయడం జరుగుతున్నాయన్నారు. వీటిపై దేశ వ్యాప్తంగా సిపిఐ పాదయాత్రలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతున్నదని అన్నారు. ఆగస్టు 6 నుండి ప్రారంభమైన ఈ దేశవ్యాప్త పాదయాత్రలు వివిధ జిల్లాలు, గ్రామీణ ప్రాంతాలు, పట్టణాల గుండా సాగుతూ అట్టడుగు వర్గాల ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కానుందని తెలిపారు. సిపిఐ పోరు యాత్రలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్
జిల్లా కార్యవర్గ సభ్యులు బీమనాథుని సుదర్శన్
జిల్లా సమితి సభ్యులు
మిట్టపల్లి పౌలు, నక్క వెంకటస్వామి, కామెర దుర్గరాజ్, మామిడి గోపి, ఎగుడ మొండి, కౌన్సిలర్ కౌడగాని సాంబయ్య, పార్టీ ప్రజాసంఘాల నాయకులు తాళ్ళపల్లి వీరయ్య, రోడ్డ నరేష్, రాయబారపు వెంకన్న, బండారి రాజేశం, రసూల్, తోకల రాజన్న, ఉప్పులేటి తిరుపతి,
తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
మండల కేంద్రంలో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు వల్లపు అశోక్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రభుత్వ నడిపిస్తున్నారని వారు ఎద్దేవాచేశారు. వికలాంగులకు ఇస్తున్న 4000 ను 6000 చేస్తా అన్నారు. ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం అన్నారు ఇంతవరకు అమలు కాలేదని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరిచి రాష్ట్ర ప్రజలకు తగు న్యాయం చేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో మండలంలో బిజెపిని బలోపేతం చేస్తూ రాష్ట్రంలో అధికారంలోకి తేవడానికి తమ వంతు కృషి చేస్తానని తనపై నమ్మకంతో మండల బాధ్యత అప్పజెప్పిన రాష్ట్ర పెద్దలకు మరియు జిల్లా పెద్దలకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న మండల అధ్యక్షునికి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వంగూరి రమేష్ సాలువాతో ఘన సన్మానం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ విక్రమ చారి, కో కన్వీనర్ బ్రహ్మదేవర శేఖర్, బిజెపి పార్టీ వార్డు సభ్యులు రాము, మరి వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మెయిన్ డ్రైనేజ్ పనులను పరిశీలించిన చైర్ పర్సన్ డాక్టర్ సంధ్యా రాణి రాజారమేష్





హైదరాబాద్ ఎస్టేట్ ఆగష్టు 10
మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ లోని 17వ వార్డు విద్యానగర్ కాలనీ ప్రజలు తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని చైర్ పర్సన్ దృష్టికి తెగ, వారు స్పందించి చైన్ జేసీబీ టెండర్ వేయించి డ్రైన్ పూడిక తీయించి డ్రైన్ పనులు చెయ్యాలని ఆదేశించగా ఈరోజు చైన్ జేసీబీ ద్వారా పనులు ప్రారంభం కాగా అక్కడికి చేరుకొని ప్రజలతో కలిసి పనులను పరిశీలించారు. గత కొన్ని సంవత్సరాల నుండి వర్షాకాలం వస్తే తీవ్ర ఇబ్బందికి లోన్నవుతున్నామని, చాలా సందర్భాలలో పనులు చెయ్యాలని చూసిన చెయ్యలేక పొయ్యరని వారు చెప్పుకొచ్చారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ మెయిన్ స్ట్రాంగ్ డ్రైన్ =ని 4 నుండి, బి జోన్ మార్కెట్ ఏరియా ద్వారా 17వ వార్డుకు వస్తుందని, ఇది చెయ్యడం ద్వారా అటు మార్కెట్ ప్రజలకు ఇటు 17వ వార్డు ప్రజలకు ఇబ్బంది ఉండదని తెలిపారు. అలాగే రాజీవ్ చౌక్ డ్రైనేజ్ పనులు ప్రారంభం అవ్వగా అక్కడి షాప్ యజమానులు వారి బాధను మరియు అసహనాన్ని చైర్ పర్సన్ దృష్టికి తీసుకురాగా ఈరోజు అక్కడికి వెళ్ళి పనులను పరిశీలించి, డ్రైనేజ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఏఈ అశృత్ ని మరియు వర్క్ ఇన్స్పెక్టర్ అవినాష్ కి చెప్పడం జరిగింది. నగర అభివృద్ధి పనులకు సంబంధించి సూపర్వైజర్ నీ పిలిచి పనులు ఆలస్యం కాకుండా వేగంగా చెయ్యాలని అదేశించారు. ప్రజలకు మరియు వ్యాపార సంస్థల యజమానులకు ఇబ్బంది కలగకుండా పనులు చెయ్యాలని సూచించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అన్ని డ్రైనేజ్ పనులను ఒక్కొకటిగా పూర్తి చేస్తామని అన్నారు. అన్ని వార్డు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలిగిన వారు చైర్ పర్సన్ ఛాంబర్ కి వచ్చి విన్నవించుకుంటే వాటిని పరిశీలించి పనులు పూర్తి అయ్యేలా చూస్తానని చెప్పారు. ప్రతి రోజు తను ఆఫీస్ లో అందుబాటులో ఉంటానని, ప్రజలకోసం, ప్రజా సమస్యల కోసం అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీ=కా పార్టీ చెన్నూర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ రాజారమేష్, మాజీ కౌన్సిలర్ రామిడి ఉమా, సీనియర్ నాయకులు రామిడి కుమార్, లక్ష్మీకాంత్, రాజీవ్ చౌక్ వర్తక సంఘం అధ్యక్షుడు రాజు, ఇరవెన రవి, సంధి సదయ్యా , లక్కీరెడ్డి, బాపు రెడ్డి, అరుణ్ రిషి, కరుణాకర్, మున్సిపాలిటీ ఏఈ అశృత్, వర్క్ ఇన్స్పెక్టర్ అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులతో మాట – పంట మార్పిడికి బాట



హైదరాబాద్ ఎ స్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతులతో మాట పంట మార్పిడికి బాట అనే నినాదం పై మండల పరిధిలోని కుక్కడం మరియు మద్దిరాల గ్రామ రైతులకు ఆరుతాడి పంటల గురించి అవగాహనా కల్పించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి అనిషారుహి అన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏలినినో ప్రమాదంతో రాష్ట్రంలో వర్షాలు పడక రబి సాగుకు రైతులు మొగ్గు చూపవద్దని ఆరుతడి పంటలు వేసుకోవాలని రైతులకు వివరించడం జరిగినదని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఆయేషా మరి వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చూపు లేకున్నా.. భూపాలపల్లి అందాలను చూపించిన చీకట్ల శంకర్

### జిల్లా సిరులు, గనుల వైభవాన్ని స్వయంగా రాసి ఆలపించిన కవి గాయకుడు

### మహాముత్తరం మట్టిలో పుట్టిన కళాకారుడి ప్రతిభకు అభినందనలు






హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్
మహాముత్తరం: కళ్లకు చూపు లేకపోయినా.. తన అంతరంగ దృష్టితో ఓ ప్రాంతం గొప్పతనాన్ని ప్రపంచానికి చూపించవచ్చని నిరూపిస్తున్నారు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తరం గ్రామానికి చెందిన కవి, గాయకుడు చీకట్ల శంకర్. తన జిల్లా అంటే ఉన్న ప్రత్యేక అభిమానంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రకృతి సౌందర్యం, సిరులు, గనుల వైభవాన్ని ప్రతిబింబించేలా ఓ ప్రత్యేక పాటను స్వయంగా రాసి, స్వయంగా ఆలపించారు.జిల్లా విశిష్టతను పదిమందికి పరిచయం చేయాలనే సంకల్పంతో శంకర్ ఈ పాటకు అక్షర రూపం ఇచ్చారు. జిల్లాలోని ప్రకృతి అందాలు, గనులు, పల్లె సంస్కృతి, నేల గొప్పతనాన్ని తనదైన శైలిలో పదాలుగా మలిచారు. అనంతరం ఆ పాటను స్వయంగా ఆలపించి సంగీతాభిమానులకు అందించారు. చూపు లేకున్నా.. తన మనసులో కనిపించిన భూపాలపల్లి జిల్లాను పాట ద్వారా అందరికీ చూపించాలనే ఆయన ప్రయత్నం ప్రత్యేకంగా నిలుస్తోంది.మహాముత్తరం మట్టిలో పుట్టిన చీకట్ల శంకర్‌కు చిన్ననాటి నుంచే సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉంది. కవిత్వం రాయడంతో పాటు పాటలు రచించి స్వయంగా పాడుతూ కళారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు.తన స్వగ్రామం మహాముత్తరం గురించి కూడా ఆయన స్వయంగా ఓ పాటను రచించి ఆలపించారు. ఆ పాటకు గ్రామ ప్రజల నుంచి మంచి స్పందన లభించడంతో పాటు ప్రశంసలు అందుకున్నారు.ప్రస్తుతం తెలంగాణ సారథిలో ఉద్యోగం చేస్తూ తన విధులను నిర్వర్తిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు తనలోని కళా ప్రతిభను కొనసాగిస్తూ పాటలు రచించడం, పాడటం చేస్తున్నారు. తనకు ఎదురైన పరిస్థితులను అడ్డంకులుగా కాకుండా, తన కళకు మరింత బలంగా మార్చుకుంటూ ముందుకు సాగుతున్న శంకర్ ప్రతిభ పలువురికి స్ఫూర్తిగా నిలుస్తోంది.భూపాలపల్లి జిల్లాపై ఆయనకు ఉన్న అభిమానమే ఈ పాటకు ప్రధాన ప్రేరణగా నిలిచింది. ఒక జిల్లాను కేవలం చూసి వర్ణించడం కంటే.. ఆ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని అనుభూతిగా మార్చుకుని, దానిని పాటగా మలచడం ద్వారా శంకర్ తన ప్రత్యేకతను చాటుకున్నారు. తన స్వరం ద్వారా జిల్లా గొప్పతనాన్ని మరింత మందికి చేరువ చేయాలన్న ఆయన ప్రయత్నం అభినందనీయం.
ఈ పాట చీకట్ల ఆడియోస్ అండ్ వీడియోస్లో అందుబాటులో ఉంటుంది. భూపాలపల్లి జిల్లా ప్రజలు, కళాభిమానులు ఈ పాటను ఆదరించి చీకట్ల శంకర్‌ను ప్రోత్సహించాలని కోరుతున్నారు.
సాహిత్యం, సంగీతం పట్ల తనకున్న మక్కువతో ముందుకు సాగుతున్న చీకట్ల శంకర్ భవిష్యత్తులో మరిన్ని అద్భుతమైన పాటలను రచించి, స్వయంగా ఆలపించాలని, తన ప్రతిభతో జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.
చూపు లేకపోయినా.. కలలకు మాత్రం హద్దులు లేవని నిరూపిస్తున్న చీకట్ల శంకర్ కళా ప్రస్థానం మరింత ఉన్నత శిఖరాలకు చేరాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.ఈ పాటకు సంగీతం రుద్రారపు విల్సన్ అందించారు మరో గాయని కొండపర్తి స్వప్న ఆలపించారు డివోపి సంతోష్ స్టార్ చేశారు

# టీయూఎస్ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా... రమేష్



హైదరాబాద్, ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి)
తెలంగాణ ఉద్యమకారుల సమితి రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్ తెలంగాణ రాష్ట్రంకోసం ప్రాణాలు అర్పించిన ఉద్యమకారుల తరఫున వారికి హృదయపూర్వక ధన్యవాదాలు నాపై నమ్మకంతో తుంగతుర్తి నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రకటించినందుకు తెలంగాణ ఉద్యమకారుల సమితి నాయకులందరిక ప్రత్యేకంగా రాష్ట్ర అధ్యక్షులు తోడేటి శంకర్ గౌడ్ హృదయపూర్వక ధన్యవాదాలు గతంలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సూర్యాపేట జిల్లాలో జాయింట్ యాక్షన్ కమిటీ తరపున జేఏసీ పాల్గొని ఎన్నోసార్లు పోలీసులు మమ్ముల అరెస్టు చేయడం జరిగింది అట్లాగే బిజెపి పార్టీలో కీలక నాయకుడిగా ఉంటూ జేఏసీ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు జేఏసీ చేపట్టిన సకలజనుల సమ్మె, వంట వార్పు మిలీనియం మార్చ్ కార్యక్రమంలో కీలకంగా పాల్గొన్నారు ఎన్నోసార్లు పోలీసులు నాపై 107 కేసులు పెట్టి కొన్ని సంవత్సరాలుగా ఆర్డీవో గారు ముందు పోలీస్ స్టేషన్లో ముందు కేసుల కోసం తిరగడం జరిగింది జాయింట్ యాక్షన్ కమిటీ లో బిజెపి ఒక భాగమై తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తెలంగాణ చిన్నమ్మ సుష్మా స్వరాజ్ బిజెపి తరపున తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని కొట్లాడారు గతంలో కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సూర్యాపేటలో ఉన్న వ్యవసాయ మార్కెట్ ప్రారంభించేయడానికి వస్తుంటే తెలంగాణ ఉద్యమంలో ఉన్న ఉద్యమకారులందరి అరెస్టు చేసి మోతే పోలీస్ స్టేషన్లో పెట్టినారు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కెసిఆర్ అధికారంలోకి వచ్చి ఉద్యమకారులు అందరికీ ఎన్నో వాగ్దానాలు చేసి ఉద్యమకారుల అనగదొక్కడం మొదలుపెట్టాడు దానికి ఇప్పుడు తెలంగాణ ఉద్యమకారులం అందరూ మా హక్కుల కోసం మాకు రావలసిన నిధుల కోసం ఈరోజు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇస్తా తప్పుకున్నది కావున తుంగతుర్తి అసెంబ్లీలో ఉద్యమకారులను ఏకతాటిపై తీసుకువచ్చి మా తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తాము అన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
11 మంగళవారం ఆగస్టు 2026

# గెలాక్సీ ఆఫ్ ఇండియా ఫ్యాషన్ షోలో 'మిస్ తెలంగాణ'గా దివ్యశ్రీ

హైదరాబాద్ ఎస్టేట్ చిట్యాల ప్రతినిధి మ్యాదరి సునీల్

హైదరాబాద్: గెలాక్సీ ఆఫ్ ఇండియా ఫ్యాషన్ షోలో తెలంగాణకు చెందిన దివ్యశ్రీ 'మిస్ తెలంగాణ' కేటగిరీలో విజేతగా నిలిచి తన ప్రతిభను చాటుకున్నారు. ఆల్ ఇండియా స్థాయిలో నిర్వహించిన ఈ ఫ్యాషన్ షోలో మొత్తం 110 మంది పాల్గొనగా, తెలంగాణ నుంచి 20 మంది పోటీదారులు పాల్గొన్నారు. అందరినీ అధిగమించి దివ్యశ్రీ 'మిస్ తెలంగాణ' కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా దివ్యశ్రీ మాట్లాడుతూ.. తనకు ఈ గొప్ప అవకాశాన్ని కల్పించిన ఈవెంట్ సంస్థ సీఈఓ ప్రసాద్‌కు, జ్యూరీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తనకు ఎంతో ఆనందంతో పాటు మరింత ఆత్మవిశ్వాసాన్ని అందించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో యాక్టింగ్ రంగంలో కొనసాగుతున్న దివ్యశ్రీ పలు టీవీ సీరియల్స్‌లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. మోడలింగ్‌తో పాటు నటనలోనూ రాణిస్తూ కళారంగంలో తన



ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. దివ్యశ్రీ 'మిస్ తెలంగాణ'గా విజేతగా నిలవడంతో ఆమె తల్లిదండ్రులు జ్యోతి, రాములు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమార్తె సాధించిన విజయంపై గర్వంగా ఉందని తెలిపారు. ఆమె పట్టుదల, కృషి, ప్రతిభకు ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో సాధించిన ఈ విజయంతో మరింత ఉత్సాహంగా ఉన్న దివ్యశ్రీ..



భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఫ్యాషన్, బ్యూటీ పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మోడలింగ్‌తో పాటు నటనా రంగంలోనూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు దివ్యశ్రీ వెల్లడించారు.

# సేవా రత్నకు రాజయ్య

## జాతీయ అవార్డుకు ఎంపిక.. 16న హైదరాబాద్‌లో ప్రదానం




వరంగల్, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
వరంగల్ జిల్లా గొర్రెకుంటకు చెందిన విద్యావేత్త, తెలంగాణ ఉద్యమకారుడు, సంఘ సేవకుడు ఎలగొండ రాజయ్య సేవా రత్ననేషనల్ అవార్డు2026కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు ఎంపిక కమిటీ ఈ మేరకు ప్రకటించింది. పేద ప్రజలకు అందిస్తున్న సేవలు, పేద విద్యార్థులకు చేస్తున్న ఆర్థిక సహాయాన్ని గుర్తించి రాజయ్యను అవార్డుకు ఎంపిక చేసినట్లు అకాడమీ జాతీయ అధ్యక్షుడు, అవార్డు ఎంపిక కమిటీ జాతీయ చైర్మన్ నల్లా రాధాకృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో రాజయ్యకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ప్రోత్సహించడంతోపాటు ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థల సేవలను గుర్తించి ప్రతి ఏటా అవార్డులు అందిస్తున్నట్లు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఆగస్టు 16న హైదరాబాద్‌లో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర సదస్సులో రాజయ్యకు అవార్డు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 300 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరుకానున్నారు. కార్యక్రమంలో బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు టేక్ రాజశేఖర్, కనుకుంట్ల విజయ్‌కుమార్, అవార్డు ఎంపిక కమిటీ సభ్యుడు బిచ్చుగారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఖిల్లా మైసమ్మ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన కాంగ్రెస్ నాయకులు





( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 10 :)
మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణ పురం డివిజన్‌లోని ప్రసిద్ధ ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఆషాఢ బహుళ ఏకాదశి సందర్భంగా బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఈ ఆధ్యాత్మిక వేడుకకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అతిథులుగా పాల్గొన్న
ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ సభ్యులు. పోచారం శ్రీనివాసరెడ్డి మాజీ మంత్రి బాన్సువాడ శాసనసభ సభ్యులు. కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ( కెఎల్ఆర్) మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్. చల్ల నర్సింహ రెడ్డి టియుఎఫ్ఐడిసి చైర్మన్ దేప భాస్కర్ రెడ్డి టీపీసీసీ మెంబర్, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ చిలుక ఉపేందర్ రెడ్డి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్ నేత, ముప్పిడి లింగస్వామి గౌడ్, ధనరాజ్ గౌడ్, ఖిల్లా మైసమ్మ దేవాలయం చైర్మన్ లినానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, చిక్కుల్ల శివప్రసాద్, తలాటి రమేష్,బొడ్డుపల్లి మహేందర్, రాజు నాయక్, దుబ్బాక శేఖర్, యాదవ్ రెడ్డి, మహమ్మద్, నబీ,సైదులు, పటేల్, రమేష్ గౌడ్, జగన్నాథం, సుదర్శన్,రేణుక,సంతోషి, అరుణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# ఎల్కతుర్తిలో అభివృద్ధి పనులు

## తహశీల్దార్ కార్యాలయానికి భూమిపూజ.. కేజీబీవీ భవనం ప్రారంభం





ఎల్కతుర్తి, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నూతన తహశీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) భవనాన్ని ప్రారంభించారు. నూతన తహశీల్దార్ కార్యాలయం ద్వారా ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు వీలవుతుందని మంత్రులు తెలిపారు. కేజీబీవీ భవనంలో బాలికలకు మెరుగైన విద్యా వసతులు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, డీసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నరసింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# రైతు కార్మికుల రాస్తారోకో

## వరంగల్ హెడ్ పోస్టాఫీసు వద్ద ఆందోళన.. స్తంభించిన ట్రాఫిక్.. నాయకుల అరెస్టు

వరంగల్, ఆగష్టు 10 హైదరాబాద్ హైదరాబాద్ ఎస్టేట్:
కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు, కార్మిక సంఘాలు చేపట్టిన రాస్తారోకోతో వరంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్ సోమవారం ఉద్రిక్తంగా మారింది. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. రహదారిపై బైఠాయించి నినాదాలు చేయడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగంలోకి దిగి పలువురు నాయకులను అరెస్టు చేసి రాస్తారోకోను విరమింపజేశారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోందని ఆందోళనకారులు ఆరోపించారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల పేరుతో విదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు దేశీయ మార్కెట్‌లో అవకాశం కల్పించడం వల్ల రైతాంగంపై మరింత భారం పడుతుందని పేర్కొన్నారు. పెరుగుతున్న సాగు వ్యయాలు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి సమస్యలతో రైతులు ఇప్పటికే సంక్షోభంలో ఉన్నారని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంటలకు మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రుణ విముక్తి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు, విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్మికుల హక్కులను పరిరక్షించేలా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే రైతులు, కార్మికులను ఐక్యం చేసి మరింత విస్తృత ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు



రమేష్, జిల్లా కన్వీనర్లు చుక్క మొగిలి, సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజు, చిర్ర సూరి, సుధమల్ల భాస్కర్, వల్లందాస్ కుమార్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి పాశం రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఎస్కేయం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు, కార్మిక సంఘాల బాధ్యుడు గంగుల దయాకర్తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి ప్రతిపాదన ఏదీ?

## - గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రోత్సాహకాలు..

## - రవిచంద్ర ప్రశ్నకు కిషన్‌రెడ్డి సమాధానం



న్యూ ఢిల్లీ: ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుకు ఆర్థిక సాయం కోరుతూ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) నుంచి ఇప్పటివరకు ఎలాంటి ప్రతిపాదన రాలేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అడిగిన ప్రశ్నకు రాజ్యసభలో సమాధానమిచ్చారు. గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు భారీ మూలధన పెట్టుబడి అవసరమని, కొత్త రంగం కావడంతో సాంకేతిక, సాధ్యాసాధ్యాల సవాళ్లు ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. జాతీయ అవసరాల దృష్ట్యా ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ఆర్థిక ప్రోత్సాహక పథకాలు అమలు చేస్తోందన్నారు. కేంద్రం 2024 జనవరి 24న రూ.8,500 కోట్లు, 2026 మే 13న రూ.37,500 కోట్లతో రెండు ప్రోత్సాహక పథకాలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ప్రైవేటు రంగ సంస్థలు సహా అర్హులైన దరఖాస్తుదారులు ఈ పథకాల ద్వారా ప్రయోజనం పొందవచ్చని పేర్కొన్నారు. గ్యాసిఫికేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు పర్యావరణం, భద్రత, చట్టపరమైన అంశాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని పలు శాఖల అనుమతులు అవసరమని మంత్రి వివరించారు. సింగరేణి నుంచి ప్రోత్సాహకం కోసం దరఖాస్తు రానందున ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక సాయం కేటాయించలేదని స్పష్టం చేశారు.

# పరకాలలో జైల్‌భరో

## ర్యాలీని అడ్డుకున్న పోలీసులు.. రోడ్డుపై బైఠాయింపు

పరకాల, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన జైల్‌భరోలో భాగంగా పరకాలలో కార్మికులు ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ నుంచి బయలుదేరిన ర్యాలీని పోలీసులు పోలీస్‌స్టేషన్ ఎదుట అడ్డుకోవడంతో నాయకులు, కార్మికులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు వారిని అరెస్టు చేసి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా కోశాధికారి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ కార్మికులు, రైతుల హక్కులకు నష్టం కలిగించే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మిక హక్కులకు నష్టం కలుగుతుందని అన్నారు. యూనియన్ ఏర్పాటు హక్కు, కనీస వేతనం, ఉద్యోగ భద్రతపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులు, విద్యుత్ సంస్కరణ బిల్లు, విత్తన చట్టం రైతులకు నష్టం కలిగిస్తాయని అన్నారు. ఉపాధి హామీ పథకానికి విఘాతం కలిగించేలా వీబీజీరామ్ బిల్లు ఉందని ఆరోపించారు. కేంద్ర విధానాలను వ్యతిరేకిస్తూ



ప్రజలు ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బొచ్చు ఆదాం, పల్లె రామన్న, పి. సమ్మక్క, రమేష్, కమల్, చరణ్, రాజమౌళి, పి. రవి, సరోజన, తిరుమలతోపాటు సుమారు 100 మంది కార్మికులు పాల్గొన్నారు.

# దళితుడి భూమికి రక్షణ

## కబ్జా యత్నంపై కేసులు నమోదు చేయాలి

## : చాపర్తి కుమార్



హసన్‌పర్తి, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
చింతగట్టు శివారులోని మునిపల్లి గ్రామానికి చెందిన దళిత కుటుంబ భూమి విషయంలో తలెత్తిన వివాదంపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని రజక రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. భూమి కబ్జాకు ప్రయత్నిస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, మాజీ ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. సోమవారం ప్రజాసంఘాల ప్రతినిధులతో కలిసి బాధితుడు నద్దునూరి నవీన్‌కుమార్ సాగు చేస్తున్న భూమిని పరిశీలించారు. సర్వే నంబర్ 141/1లోని 19 గుంటల సీలింగ్ భూమిని నవీన్‌కుమార్, ఆయన తండ్రి ఐలయ్య సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారని చాపర్తి తెలిపారు. పక్క భూమికి సంబంధించిన వివాదాన్ని ఆసరాగా చేసుకుని బాధిత కుటుంబంపై ఒత్తిడి తెస్తూ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు తగిన చర్యలు తీసుకోలేదన్నారు. భూ వివాదంపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని, జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని చాపర్తి కుమార్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే దళిత, బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, అసైన్డ్ భూమి సమితి అధ్యక్షుడు కలకోటి మహేందర్, ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేష్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రామచందర్‌రావు, మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకుడు మాదాసు జితేందర్, దళిత సంఘం నాయకుడు అంకిల్ల రాజుతోపాటు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్‌మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

## - సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్



హైదరాబాద్ ఎస్టేట్స్ యాదాద్రి భువనగిరి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం
ఈ రోజు అడ్డగుడూర్ మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జైల్ బరో కార్యక్రమం భవన నిర్మాణ సంఘం మండల అధ్యక్షులు పనుమటి బిక్షం అధ్యక్షత న నిర్వహించడం జరిగింది.
ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ నాడు బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో నేడు కార్పొరేట్ పెట్టుబడిదారులు, మతోన్మాద శక్తుల విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలుకు ఫైనల్ రూల్స్‌ను నోటిఫై చేయడం, విద్యుత్ సవరణ బిల్లు2025, విత్తన చట్టానికి సవరణలు వంటి చర్యలకు పూనుకోవడం ద్వారా పెట్టుబడిదారులకు అనుకూలంగా విధానాలను తీసుకొస్తోందని విమర్శించారు.కార్మికుల శ్రమను మరింతగా దోచుకునేందుకు పని దినాలను పెంచుతూ, రోజువారీ పని సమయాన్ని 8 గంటల నుంచి 12 గంటల వరకు పెంచుకునే విధంగా యజమాన్యాలకు స్వేచ్ఛ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులు దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న 8 గంటల పని, సమ్మె హక్కు, కార్మిక సంఘాల హక్కులు, ఉద్యోగ భద్రత వంటి హక్కులను లేబర్ కోడ్స్ ద్వారా కాలరాస్తున్నారని అన్నారు.
కార్మిక సంఘాల గుర్తింపు, రిజిస్ట్రేషన్‌పై కఠిన ఆంక్షలు విధించడం ద్వారా కార్మికుల సంఘటిత పోరాటాలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్స్ అమలైతే తరతరాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను కార్మికవర్గం కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, పీఎఫ్, ఈఎస్ఐ, వెల్ఫేర్ బోర్డులపై కోతలు, ఆంక్షలు విధిస్తోందని అన్నారు.
గ్రామపంచాయతీ కార్మికులుఅంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ, వీఏఓలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆరోగ్యశాఖలోని వివిధ స్కీమ్‌లలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు.
గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో ప్రజలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారని, అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కఠిన నిర్ణయాల వల్ల ఉపాధి హామీ పథకం నీరుగారిపోతోందని అన్నారు. ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించి, గ్రామీణ పేదలకు సంవత్సరానికి కనీసం 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.
రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.
కార్పొరేట్ పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే విధానాలను విడనాడి, రైతు, కార్మిక, వ్యవసాయ కూలీల హక్కులను కాపాడే విధానాలను పాలకులు అవలంబించాలని కోరారు. ప్రజా వ్యతిరేక, కార్మికరైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు, ప్రజాతంత్రవాదులు ఐక్యంగా పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు గూడెపు కొమిరెల్లి , కందుకూరు లచ్చయ్య, గోపాల స్వామి, చిప్పలపల్లి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చిప్పలపల్లి వెంకన్న, గజ్జెల్లి రవి, సహాయ కార్యదర్శులు : బోడ అంజయ్య , వంగూరు రామ లింగయ్య , అల్వాల శంకర్ , జూటూరి పరమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్: జిల్లా శంకర్ . కోశాధికారి: చేతల రవి. సంఘ సభ్యులు,సూరారం అంజయ్య, సూరారం మచ్చ గిరి, బి కిష్టయ్య గ్రామ పంచాయతీ వర్కర్స్ బాలెంల మల్లయ్య,కందుకూరి పద్మ,డప్పు సోమయ్య,ననుబోతు అవిలయ్య తదితరులు పాల్గొన్నారు.

# గీసుకొండలో రాస్తారోకో

## జైల్‌భరోలో భాగంగా ఆందోళన.. లేబర్ కోడ్‌ల రద్దు, రైతులకు గిట్టుబాటు ధరకు డిమాండ్





గీసుకొండ, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ, రైతాంగ విధానాలను నిరసిస్తూ సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా గీసుకొండ మండలం కొనేమాకుల వద్ద సోమవారం రాస్తారోకో నిర్వహించారు. సంఘాల నాయకులు, కార్యకర్తలు రహదారిపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ గీసుకొండ మండల కన్వీనర్ తోగిటి బ్రహ్మాచారి మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగులు, రైతుల హక్కుల పరిరక్షణకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వీబీజీరాంజీ చట్టాన్ని రద్దు చేసి, గతంలో అమల్లో ఉన్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. గ్రామీణ కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, కార్మికులు, ఉద్యోగులకు కనీస నెలసరి వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్మికులు, రైతుల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మండల అధ్యక్షుడు గోరుకంటి రమేష్, గ్రామపంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మండల అధ్యక్షుడు కొమ్ముల రాంబాబు, కార్యదర్శి కొంగర సదానందం, కొంగర ఎల్లయ్య, లక్క సాంబయ్య, మందా రమేష్, మిట్టపల్లి ప్రవీణ్, కోట సంతోష్, సీహెచ్. జేమ్స్, కొమ్ముల కరుణాకర్, దౌడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్ది విగ్రహం ఏర్పాటుకు కేశవరావు చొరవ చూపాలి

## - నర్సంపేట మెడికల్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేయాలి..

## - టీఆర్‌యూఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం రఘు



నర్సంపేట, ఆగష్టు 10 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలకు గుర్తింపుగా ఆయన విగ్రహాన్ని నర్సంపేట మెడికల్ కాలేజీ ఎదుట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని టీఆర్‌యూఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం రఘు కోరారు. ఈ అంశంపై తెలంగాణ ఉద్యమకారుల కమిటీ చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు కె. కేశవరావు జోక్యం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించాలని విజ్ఞప్తి చేశారు. 2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్‌రెడ్డి చురుకుగా పనిచేశారని రఘు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉద్యమ కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను ఉద్యమంలో భాగస్వాములను చేసేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. నర్సంపేట ప్రాంత రైతుల సాగునీటి అవసరాల కోసం కూడా ఆయన కృషి చేశారని రఘు తెలిపారు. పాకాల, గుండం, రంగనాయక, మదన్నపేట తదితర చెరువులకు దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించేలా అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి కాలువల ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. దీనివల్ల నర్సంపేట, మహబూబాబాద్ ప్రాంతాల్లోని రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడిందని పేర్కొన్నారు. నర్సంపేటకు మెడికల్ కాలేజీ మంజూరు విషయంలోనూ పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారని రఘు తెలిపారు. నర్సంపేట జిల్లా కేంద్రం కాకపోయినా, అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి మెడికల్ కాలేజీ కోసం ప్రయత్నించారని చెప్పారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన సేవలకు గుర్తుగా విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నర్సంపేట ప్రజలు నిర్ణయించారని రఘు తెలిపారు. ఇందులో భాగంగా మెడికల్ కాలేజీ సమీపంలోని ప్రైవేటు స్థలంలో విగ్రహం ఏర్పాటు కోసం గద్దె నిర్మించగా, మున్సిపల్ అధికారులు దానిని తొలగించారని ఆయన పేర్కొన్నారు. విగ్రహం ఏర్పాటు అంశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సానుకూలంగా పరిశీలించాలని రఘు కోరారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి సేవలను గుర్తిస్తూ విగ్రహం ఏర్పాటు కోసం తగిన స్థలం, అనుమతులు కల్పించేలా కేశవరావు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కేశవరావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని రఘు తెలిపారు.

# కరపత్ర ఆవిష్కరణ 11 న చలో ఆలేరు జిల్లా సాధన జయప్రదం

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మంద మహేష్ మాదిగ





హైదరాబాద్ ఎస్టేట్స్ యాదాద్రి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం
ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక. జాతీయ అధ్యక్షులు గౌరవ శ్రీ మేడి పాపన్న మాదిగ గారి ఆదేశాల మేరకు మరియు రాష్ట్ర అధ్యక్షులు కేదాస్ మోహన్ గారి పిలుపు మేరకు ఈ రోజున అడ్డగూడూర్ మండల కేంద్రంలో ఈనెల 11న ఆలేరు మండల కేంద్రంలో జరగబోయే జిల్లా సాధన జయప్రదం చేయుటకై కరపత్ర ఆవిష్కరణ అడ్డగూడూరు మండల అధ్యక్షులు మంద మహేష్ మాదిగ గారి ఆధ్వర్యంలో ఆవిష్కరణ చేశారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమనికి. ముఖ్యఅతిథిగా జిల్లా ఉపాధ్యక్షులు ఇటికాల ఆంజనేయులు మాదిగ హాజరై మాట్లాడుతూ ఆలేరు మండలంలో జరగబోయే జిల్లా సదస్సును అడ్డగూడూర్ మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వం. కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్ల డిగ్రీ రిజిస్ట్రేషన్ లో ఇచ్చిన అంబేద్కర్ అభ్యాస పథకాన్ని వెంటనే అమలు చేయాలని అలాగే మాదిగ ఉద్యమకారులకు పెన్షన్ అమలు చేయాలని కోరారు నిరుపేద దళిత కుటుంబాలకు అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు ఈ కార్యక్రమంలో గుండాల మండల అధ్యక్షుడు నత్తి కృష్ణ మాదిగ మండల ఉపాధ్యక్షులు చేడ రవి మాదిగ మండల నాయకులు బోడ వెంకన్న చేడకిషోర్ గూడెం దామోదర్ బాలముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ బోనాలు

## అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆర్.వి. మహేందర్ కుమార్





హైదరాబాద్, ఆగస్టు 10: గోషామహల్ నియోజకవర్గ పరిధిలోని శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో సోమవారం బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ఎల్లమ్మ తల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఆలయ పరిసరాల్లో భక్తుల రాకతో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను సమర్పించి అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో సి.కే. మూర్తి, నరేందర్ యాదవ్, శేఖర్ చారి, రవీందర్ రెడ్డి, గుజ్జ నవీన్, జగదీష్ గుప్తా తదితరులు పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు.

# జీడబ్ల్యూఎంసీ ఎన్నికలకు కాంగ్రెస్ సమరసన్నాహం

## డివిజన్ల వారీగా బలాబలాలపై సమీక్ష.. పార్టీ బలోపేతంపై మంత్రి పొంగులేటి దిశానిర్దేశం

హనుమకొండ, ఆగస్టు 10 హైదరాబాద్ ఎస్టేట్: రాబోయే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణకు సిద్ధమవుతోంది. డివిజన్ల వారీగా పార్టీ బలాబలాలను సమీక్షించి, గెలుపు వ్యూహాలను రూపొందించాలని రాష్ట్ర ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. హనుమకొండ డీసీసీ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. అనంతరం పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాబోయే ఎన్నికలకు పార్టీ సన్నద్ధతపై నాయకులతో సుదీర్ఘంగా చర్చించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమి కేటాయింపు ప్రతిపాదనను రాబోయే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రవేశపెట్టి త్వరితగతిన ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా నాయకత్వం మంత్రిని కోరింది. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. జీడబ్ల్యూఎంసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే డివిజన్ల వారీగా కార్యాచరణ రూపొందించుకోవాలని, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయాలని మంత్రి సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన 13 మండలాల అధ్యక్షులు, 10 డివిజన్ అధ్యక్షులు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఓటర్ల జాబితాలోని చిరునామా లోపాలు, బోగస్ ఓట్లుగా గుర్తించిన అంశాలు, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన సవరణలకు చర్యలు



తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. పీఏసీఎస్‌లు, రాష్ట్ర డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామక ప్రక్రియలోనూ సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. సమావేశంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కె.ఆర్.నాగరాజు, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీ నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, నూతనంగా నియమితులైన మండల, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి కేంద్రం ప్రాధాన్యం

## 4.21 లక్షల మందికి గ్రూప్ ప్రమాద బీమా రక్షణ

### : ఎల్.వి. రమణ ముదిరాజ్



హైదరాబాద్, ఆగస్టు 10: మత్స్యకారుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎల్.వి. రమణ ముదిరాజ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్రంలోని 4,21,767 మంది నమోదిత మత్స్యకారులకు గ్రూప్ ప్రమాద బీమా పథకం (+ూ×ూ) అమలు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.బీమా ప్రీమియంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు సమకూరుస్తున్నాయని తెలిపారు. 18 నుంచి 70 ఏళ్ల వయస్సు గల నమోదిత మత్స్యకారులకు ఈ పథకం వర్తిస్తుందని, 2026 జూన్ 1 నుంచి నిరంతర బీమా రక్షణ అందుబాటులో ఉంటుందని వివరించారు.ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత సంపూర్ణ వైకల్యానికి రూ.5 లక్షలు, పాక్షిక వైకల్యానికి రూ.2.50 లక్షలు బీమా పరిహారం లభిస్తుందని చెప్పారు. అలాగే ఆసుపత్రిలో చికిత్స పొందినప్పుడు రూ.25 వేల వరకు వైద్య సహాయం అందుతుందని తెలిపారు.అర్హులైన మత్స్యకారులందరూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎల్.వి. రమణ ముదిరాజ్ విజ్ఞప్తి చేశారు.

# పెద్ది లేని లోటు పూడ్చలేనిది

## పెద్ది విగ్రహ ఏర్పాటు గద్దె కూల్చివేత దుర్మార్గం

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ గారు

కాజీపేట చౌరస్తాలో నర్సంపేట మాజీ శాసనసభ్యులు, ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి యాదిలో కార్యక్రమాన్ని సోమవారం రోజున నిర్వహించారు మొదట పెద్ది చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు

ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ గారు మాట్లాడుతూ

నిస్వార్థమైన గొప్ప తెలంగాణ ఉద్యమకారుడు, గొప్ప నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని కొనియాడారు

పెద్దితో నాకు ఉన్నది ఉద్యమ అనుబంధం తెలంగాణ కోసం కలిసి పోరాడంఇదే కాజీపేట కేంద్రంగా ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, బంద్లు, వంటా వార్పులు చేశాం ఎన్నో రాస్తారోకోలు, రైల్ రోకోలు చేశాము ఎన్నో కేసులు ఎదుర్కొని కోర్టులకు వెళ్ళాం పెద్ది మనల్ని విడిచి వెళ్లడం బాధాకరం కేసీఆర్ గారి నాయకత్వంలో మేము ఇద్దరం కలిసి పోరాడిన సందర్భాలు అనేకం నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి పెద్ది విగ్రహ ఏర్పాటు గద్దె కూల్చివేత దుర్మార్గం స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దె గుల్చివేత కూల్చివేత దుర్మార్గం



ఒక ఉద్యమకారుడు, నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేసిన మాజీ ప్రజాప్రతినిధి విగ్రహ ఏర్పాటును ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకోవడం సిగ్గుచేటు

ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాం, డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వమే పెద్ది విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

# మ్యూజికల్ గార్డెన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారు...



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ

హనుమకొండ జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో ATMA కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి అధ్యక్షతన సోమవారం కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన రైతు మేళా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గారితో వర్ధన్నపేట ఎమ్మెల్యే విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం వరంగల్ నగరంలో మ్యూజికల్ గార్డెన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

# పేద దళిత రైతుల డి-పట్టా భూములను రక్షించాలి

## - ప్రత్యామ్నాయ దారి ఉన్నప్పటికీ దళితుల భూముల్లో రోడ్డు వేయడం అన్యాయం

## - కాకినాడ జిల్లా కలెక్టర్ తక్షణం జోక్యం చేసుకోవాలి: డా. పిట్టా వరప్రసాద్





హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి కాకినాడ, ఆగస్టు 10, 2026: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్ద శంకర్లపూడి గ్రామంలో భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు ప్రభుత్వం డి-పట్టాల రూపంలో కేటాయించిన భూములను రోడ్డు నిర్మాణం పేరుతో దూరం చేసే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.పెద్ద శంకర్లపూడి గ్రామంలో సుమారు 25 మంది భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు ఒక్కొక్కరికి సుమారు 0.25 సెంట్ల నుంచి 0.50 సెంట్ల వరకు ప్రభుత్వ భూమిని డి-పట్టాల ద్వారా కేటాయించారని, ఆ భూములను లబ్ధిదారులు అనేక సంవత్సరాలుగా సాగు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని ఆయన తెలిపారు.

అయితే ప్రస్తుతం కొంతమంది రైతుల భూములకు రాకపోకల కోసం దళితులకు కేటాయించిన భూముల మీదుగా రోడ్డు నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఈ వ్యవహారంలో రాజకీయ ఒత్తిళ్లకు రెవెన్యూ అధికారులు గురవుతున్నారనే ఆరోపణలు స్థానికంగా వస్తున్నాయని డా. పిట్టా వరప్రసాద్ పేర్కొన్నారు.“ఇప్పటికే ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులో ఉన్నప్పటికీ, పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల మీదుగానే రోడ్డు వేయాలని ప్రయత్నించడం ఎందుకు?” అని ఆయన ప్రశ్నించారు.పేదలకు ప్రభుత్వం కేటాయించిన భూములు కేవలం రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములు కాదని, అవి దళిత కుటుంబాల జీవనాధారమని ఆయన అన్నారు. చిన్నచిన్న విస్తీర్ణాల్లో ఉన్న ఈ భూముల్లో రోడ్డు నిర్మిస్తే వారి సాగుకు తీవ్ర నష్టం కలిగి, ఇప్పటికే అతి తక్కువభూమిపై ఆధారపడుతున్న కుటుంబాలు మరింత ఇబ్బందులకు గురవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.కలెక్టర్‌కు దళిత రైతుల వినతిఈ నేపథ్యంలో బాధిత దళిత రైతులు కాకినాడ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించి తమ భూములను రక్షించాలని కోరారని డా. పిట్టా వరప్రసాద్ తెలిపారు.వినతిపత్రంలో కోరిన విధంగా:దళితుల డి-పట్టా భూముల్లో రోడ్డు నిర్మాణ పనులను తక్షణం నిలిపివేయాలి.జిల్లా స్థాయి అధికారులు స్థల పరిశీలన నిర్వహించాలి.డి-పట్టాలు, అడంగల్, 1-దీ, ఖీవీదీ, గ్రామ మ్యాప్ తదితర రెవెన్యూ రికార్డులను పరిశీలించాలి.అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మార్గాన్ని వినియోగించాలి.రాజకీయ ఒత్తిళ్లకు లోబడి దళితుల భూముల్లో పనులు చేపట్టకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలి.దళిత రైతుల భూములకు, సాగుకు పూర్తి రక్షణ కల్పించాలి.“దళితుల భూములు దళితులకే ఉండాలి”భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని డా. పిట్టా వరప్రసాద్ అన్నారు.“అధికారంలో ఉన్నవారి ఒత్తిళ్లకు పేద దళితులు బలికావడానికి వీల్లేదు. ప్రత్యామ్నాయ దారి ఉన్నప్పుడు దళితుల జీవనాధారమైన భూములను రహదారి కోసం తీసుకోవడం సమంజసం కాదు. ముందుగా బాధిత రైతుల వాదనను వినాలి, పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. చట్టబద్ధమైన ప్రక్రియ లేకుండా వారి భూముల్లో ఎలాంటి పనులు చేపట్టకూడదు” అని ఆయన స్పష్టం చేశారు.కాకినాడ జిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంలో తక్షణమే జోక్యం చేసుకుని స్థల పరిశీలనకు ఆదేశాలు జారీ చేసి, దళిత రైతుల డి-పట్టా భూములను రక్షించాలని డా. పిట్టా వరప్రసాద్ డిమాండ్ చేశారు.“పేద దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములు కాపాడాలి దళితుల భూములు దళితులకే ఉండాలి” అని ఆయన స్పష్టం చేశారు. డా. పిట్టా వరప్రసాద్‌జాతీయ కార్యదర్శి & ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులురిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్)







